తెలుగు జ్యోతి రచనలపోటీలో ద్వితీయ బహుమతి పొందిన కవిత
పురస్కార ప్రదాత శ్రీ నరసింహ్ దేవర సత్య శశిధర్, ఫ్రీహోల్డ్, న్యూజెర్సీ

# సడిచేయకే గాలి

- చొక్కాకుల ప్రసాద్

సడిచేయకే గాలి సడిచేయకె
సవ్వడిచేసి మాపాప కునుకు చెడదీయకె

ఆటలాడీ పాప అలసి నిదురోతున్నాది
నిదురలో కమ్మనీ కలలు కంటున్నాది
కలలో మా బంగారు రంగురంగుల
సీతాకోకచిలుకల వెంట పరుగెడుతున్నాది
నిదుర చెదిరితె బంగారుకల చెదిరిపొయ్యేను
సీతాకోకచిలుక పారిపొయ్యేను

సడిచేయకే గాలి సడిచేయకె
సవ్వడిచేసి మాపాప కునుకు చెడదీయకె

అమ్మ, అక్కలతోడ దోబూచులాడింది
తాత, నానమ్మలతో కతలెన్నో చెప్పింది
నిదురలో మాతల్లి ఏం కలలు కంటున్నాదో
ముసిముసిగా మాత్రమూ నవ్వుతున్నాది

సడిచేయకే గాలి సడిచేయకె
సవ్వడిచేసి మాపాప కునుకు చెడదీయకె

బుడి బుడి అడుగులతో బుల్లి మాతల్లి
నట్టింట తిరిగింది తలుపుమాటున దాగి,
తానెక్కడో చెప్పుకోమన్నాది
ఇల్లంత తిరిగి ఇంట కళ నింపి
అలసి సొలసీ పాప నిద్దురోతున్నాది



సడిచేయకే గాలి సడిచేయకె
సవ్వడి చేసి మాపాప కునుకు చెడదీయకె

**చొక్కాకుల ప్రసాద్**

స్వగ్రామం చంద్రపేట (విజయనగరం జిల్లా). ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నంలో ఇంజనీరింగ్ చేశారు. గత పదేళ్ళుగా భార్య చింథియాతో కలిసి మాంట్రియల్ కెనడాలో ఉన్నారు.



Telugu Jyothi Special Issue April 08